క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

అర్వపల్లి : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంఎన్‌ఓ, హెచ్‌ఎం కుంభం ప్రభాకర్ అన్నారు. పాఠశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో మొక్కలు నాటారు. అనంతరం సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పర్యావరణం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

పైసలిస్తేనే పనులు!

- అధికారుల తీరుపై బాధితుడు తీసిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్


కార్యాలయంలో తలుపులు వేసి ఉన్న గది

నాగారం : నాగారం తహసీల్దార్ కార్యాలయంలో పైసలిస్తేనే పనులు చేస్తున్నారని, లేదంటే దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అధికారులు కంప్యూటర్ గదికి తలుపులు వేసి ఉంచడంతో మండల కేంద్రానికి చెందిన కడియం శ్యాంప్రసాద్ అనే వ్యక్తి ఫొటో తీసి సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేయగా అది వైరలైంది. ఈ విషయమై తహసీల్దార్ హరికిశోర్ శర్మను వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదని, రెవెన్యూ సిబ్బంది పనుల్లో నిర్లక్ష్యం వహించినా, అవినీతికి పాల్పడినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మధ్యాహ్న భోజన సమయంలో సిబ్బంది తలుపులు దగ్గరకి వేసి ఉండొచ్చన్నారు. ఎవరికైనా కార్యాలయంలో సమస్యలెదురైతే తనను నేరుగా కలువవచ్చని సూచించారు.

రైతులు పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

నాగారం : రైతులు తప్పనిసరిగా పంటల వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కృష్ణకాంత్ తెలిపారు. మంగళవారం డి.కొత్తపల్లి, వర్ధమానుకోట, మామిడిపల్లి గ్రామాల్లో పంటల నమోదు సర్వేను పరిశీలించి మాట్లాడారు. రైతులు సాగు చేస్తున్న పంటల వివరాల ఆధారంగానే వాటిని కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. పంట నమోదు చేసుకోని రైతులు తమ పంటలను ఐకేపీ, సీసీఐ వంటి కేంద్రాలలో అమ్ముకోలేరని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు సాయిరాజ్, సంధ్య, శ్రీను, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఓ బాధ్యతలు స్వీకరణ


రాజేశ్వర్

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓగా బీసు రాజేశ్వర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఆయన ఆత్మకూర్(ఎస్) మండలంలో పనిచేశారు. అక్కడి నుంచి బదిలీపై పెన్‌పహాడ్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

క్రీడలతో మానసిక వికాసం

ఆత్మకూర్ (ఎస్) : క్రీడలు విద్యార్థుల్లో శారీరక, మానసిక వికాసానికి తోడ్పడుతాయని మండల విద్యాధికారి ధారా సింగ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఏపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి అండర్ 17, అండర్ 14 బాలబాలికల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఇతరులకు సహకారం చేయాలన్న భావన పెంపొందుతుందన్నారు. జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయికి చేరి మంచి పేరు తెచ్చుకునే అవకాశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం జే జాన్, వెంకటయ్య, శ్రవణ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సులోచన, క్రీడా పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి, గంగా, వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

శ్రీను మరణం బాధాకరం

ఆత్మకూర్ (ఎస్) : సీఆర్పీఎఫ్ ఏఎస్ఐ కలకోట్ల శ్రీను ఆకస్మిక మరణం చాలా బాధాకరమని జిల్లా బీజేపీ అధ్యక్షురాలు చల్ల శ్రీలత రెడ్డి అన్నారు. మంగళవారం ఏనుబాముల గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్పీఎఫ్ ఏఎస్ఐ కలకోట్ల శ్రీను కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ కో కన్వీనర్ తుక్కాని మన్మథ రెడ్డి, గరిడేపల్లి మండల అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు దాసరి వెంకన్న, చిత్తలూరి సోమయ్య, ఉప్పల చారి, పద్మ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న శ్రీలత రెడ్డి, తదితరులు

పేదల పెన్నిధి వైఎస్ రాజశేఖర రెడ్డి


సూర్యాపేట : వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


తిరుమలగిరిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేల్, తదితరులు

సూర్యాపేట : పేదల పెన్నిధి, రైతుల పాలిట దేవుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు డేగల రమేష్ నాయుడు అన్నారు. మంగళవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఖమ్మం క్రాస్‌రోడ్డులోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ ప్రదాత వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎండీ రఫీ, రావుల రాంరెడ్డి, నాగిరెడ్డి, మోహన్ రెడ్డి, శంకరయ్య, బి.పున్నయ్య, ఎం.రాము, ఎస్‌కే రవి పాల్గొన్నారు.

తిరుమలగిరి : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ముఖ్య అతిథిగా హాజరై రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ రాజశేఖర రెడ్డిదే అని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి ఇంటికి వైఎస్సార్ సంక్షేమ పథకాలు అందాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, జిల్లా అధికార ప్రతినిధి సంకెపల్లి కొండల్‌రెడ్డి, నాయకులు అభిషేక్‌రెడ్డి, అంబేద్కర్, లక్ష్మయ్య, సతీష్, సుధాకర్, యాదగిరి, కృష్ణ, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే మందుల సామేల్


తిరుమలగిరిలో మాట్లాడుతున్న సామేల్


అర్వపల్లిలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి : కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తిరుమలగిరి మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయని, నాయకులు, కార్యకర్తలు అందరూ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఈ ఇరవై నెలల కాలంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని సూచించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక..

తిరుమలగిరి మున్సిపాలిటీకి చెందిన 40 కుటుంబాలు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సామేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, సంకెపల్లి కొండల్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, పేరాల వీరేష్, పాలెపు చంద్రశేఖర్, అంబేద్కర్, శోభారాణి, యాదగిరి, రవీందర్‌రెడ్డి, లక్ష్మయ్య, రాములు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

అర్వపల్లి : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం అర్వపల్లిలో వివిధ గ్రామాల లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చని, కాబట్టి కాంగ్రెస్ శ్రేణులు కష్టపడి పనిచేసి అన్ని స్థానాలను గెలుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవరావు, హౌజింగ్ పీడీ సిద్ధార్థ, మార్కెట్ చైర్‌పర్సన్ చామంతి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సామ అభిషేక్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, తహసీల్దార్ బి.శ్రీకాంత్, ఎంపీడీఓ గోపి, ఏఎంసీ డైరెక్టర్లు బి.సైదులు, జలేందర్, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎ.రాజేందర్‌రెడ్డి, మోరపాక సత్యం, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, మాజీ జెడ్పీటీసీ అవిలయ్య, బైరబోయిన మహరాజు, మాజీ సర్పంచ్‌లు జీడి వీరస్వామి, సురేష్, నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రహదారి పొడవునా గుంతలే..


గుంతలమయంగా ఉన్న కంచుగట్లగూడెం రోడ్డు


గ్రామ శివారులో ఇలా..

- అధ్వానంగా కంచుగట్లగూడెం రోడ్డు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు
- బీటీగా మార్చాలని గ్రామస్తుల వేడుకోలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం–నాగారం మండలాల మధ్య ఉన్న కంచుగట్లగూడెం రోడ్డు అధ్వానంగా మారింది. ఇప్పటికే ఎలాంటి అభివృద్ధికి నోచుకోని ఈ శివారు గ్రామానికి రోడ్డు కూడా సక్రమంగా లేకపోవడంతో గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలోని సగం ఇళ్లు నాగారం మండలం పేరబోయినగూడెం, మిగిలిన సగం ఇళ్లు జాజిరెడ్డిగూడెం మండల కేంద్రం పరిధిలో ఉన్నాయి. ప్రస్తుతం భారీ వర్షాలకు ఈ గ్రామ రోడ్డు పరిస్థితి అధ్వానంగా తయారైంది.

ఇప్పటికీ ఫార్మేషన్ రోడ్డే..

తుంగగూడెం నుంచి కంచుగట్లగూడెం వరకు కేవలం కిలోమీటర్ దూరం ఉంటుంది. ఈ దారి ఇప్పటికీ ఫార్మేషన్ రోడ్డుగానే ఉంది. దీంతో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు పొడవునా పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అందులో వర్షపునీళ్లు నిలిచాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ గ్రామాన్ని ఒకే మండలం, ఒకే గ్రామపంచాయతీ కిందకు మార్చి బీటీ రోడ్డు నిర్మించి తాము ఎదుర్కొంటున్న రాకపోకల సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు అధ్వానంగా మారింది



మా గ్రామం ఇప్పటికీ రెండు మండలాలు, రెండు గ్రామ పంచాయతీల మధ్య నలిగిపోతుంది. సగం ఊరు నాగారం, మిగిలిన సగం ఊరు జాజిరెడ్డిగూడెం మండలం కిందకు ఉంది. గ్రామానికి వెళ్లే రోడ్డు వర్షాలకు దెబ్బతింది. బీటీ రోడ్డుగా మార్చి ఇబ్బందులు తీర్చాలి.

\- కంచుగట్ల లింగయ్య, కంచుగట్లగూడెం

పింఛన్‌లు మంజూరు చేయాలి

అర్వపల్లి : కొత్త ఆసరా పింఛన్లను ప్రభుత్వం తక్షణమే మంజూరు చేయాలని సామాజిక తెలంగాణ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు మల్లయ్య, పూలే–అంబేద్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య, సీపీఎం సీనియర్ నాయకుడు చేను శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఏడేళ్లుగా కొత్త పింఛన్లు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పాత పింఛన్లు పెంచడంతోపాటు, కొత్త పింఛన్లు మంజూరు చేయాలని వారు కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట : బాలెంలలో ఉన్న సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో జువాలజీ, కంప్యూటర్ సైన్స్, కామర్స్ సబ్జెక్టులను బోధించడానికి అర్హులైన మహిళా అధ్యాపకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55శాతం మార్కులు సాధించి, నెట్ లేదా సెట్ క్వాలిఫై అయ్యి, కనీసం మూడేళ్ల బోధనా అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు సెప్టెంబర్ 6, 2025లోపు కళాశాలలో సంప్రదించవచ్చని సూచించారు. సెప్టెంబర్ 8, 2025 సోమవారం ఉదయం 10 గంటలకు డెమో నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9398316225, 7555010681 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

400 మందికి నాలుగు మరుగుదొడ్లే..


మరుగుదొడ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్

తుంగతుర్తి : మండల కేంద్రంలోని తెలంగాణ గిరి జన బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలపై తహసీల్దార్ దయానందం మంగళవారం పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలలో 603 మంది విద్యార్థినులు ఉండగా ప్రస్తుతం 416 మంది హాజరవుతున్నారు. ఇక్కడ మొత్తం 72 మరుగుదొడ్లు నిర్మించగా వాటిలో నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయి. దీంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన తహసీల్దార్ దయానందం మరుగుదొడ్లను పరిశీలించారు. శానిటరీ వ్యవస్థ సరిగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే శుభ్రం చేయించి, పనిచేయని వాటిని బాగు చేయించాలని ప్రిన్సిపాల్ అరుణశ్రీకి సూచించారు. ఈ సమస్యల కారణంగా కొంతమంది విద్యార్థినులు టీసీలు తీసుకుని వెళ్లిపోతున్నారని తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. అనంతరం వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించి, మెనూ ప్రకారం తాజా కూరగాయలతో భోజనం అందించాలని సూచించారు. ప్రార్థన సమయానికి ఉపాధ్యాయులు, అధ్యాపకులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. తనిఖీలో ఎంఆర్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నూతనకల్‌లోని జెడ్పీ హెచ్చెస్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

నూతనకల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988–89 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు



యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు

తుంగతుర్తి : యూరియా కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. సరైన సమయంలో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. మంగళవారం తుంగతుర్తి సొసైటీకి యూరియా వస్తుందని తెలిసి రైతులు వేకువజాము నుంచే తుంగతుర్తిలోని రైతు సేవా సహకార సంఘం వద్ద బారులుదీరారు. తమ పనులను వదులుకుని మరీ యూరియా కోసం ఎదురుచూస్తున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి యూరియా కొరత తీర్చాలని కోరుతున్నారు. ఈ సమస్య వల్ల పంటలకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాలి


ఇళ్ల వద్ద సర్వే చేస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు అన్నారు. మంగళవారం ప్రజా పోరుబాటలో భాగంగా ఏపూరులో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏపూరులో ఎనిమిది సంవత్సరాల క్రితం 65 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించారని అన్నారు. అయితే రెండేళ్ల క్రితం 51 మంది లబ్ధిదారులను లాటరీ పద్ధతిలో గుర్తించారని, కానీ ఇప్పటి వరకు వారికి ఇళ్లను కేటాయించలేదని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించి, పట్టాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ కార్యదర్శి సానబోయిన ఉపేందర్, నూకల గిరి ప్రసాద్‌రెడ్డి, నవీల రవి, వరికుప్పల మహేష్, మండల కమిటీ సభ్యులు ఎరుకల నాగరాజు, ఎల్లుట్ల లింగయ్య, షేక్ అఖిల్ పాష, నవీల లింగయ్య, మధుసూదన్, జయరాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

అర్వపల్లి : గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు విమర్శించారు. మంగళవారం రామన్నగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన 'పోరుబాట' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధులను పరిశీలించి, ప్రజల సమస్యలపై సర్వే నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, కృష్ణయ్య, శిగ వెంకన్న, సైదయ్య, వెంకన్న, వినయ్, భద్రయ్య, విజయ్, రాములు, నర్సయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారుల పాలనతో అస్తవ్యస్తం

పెన్‌పహాడ్ : ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు అస్తవ్యస్తంగా మారి, పారిశుద్ధ్యం పూర్తిగా లోపించిందని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ విమర్శించారు. మంగళవారం లింగాల గ్రామంలో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాలలో చెత్తకుప్పలు పేరుకుపోయాయని, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జ్వరాలు ప్రబలకుండా ముందస్తుగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రణపంగ బుచ్చిరాములు, మామిడి భిక్షం, పుల్లయ్య, మధు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి

నాగారం : గ్రామాలలో నెలకొన్న మౌలిక సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం డిమాండ్ చేశారు. సీపీఎం పోరుబాటలో భాగంగా మంగళవారం డి.కొత్తపల్లి గ్రామంలో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించి మాట్లాడారు. ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దేవరకొండ యాదగిరి, మండల కమిటీ సభ్యులు కడియం కుమార్, గుడిపూరి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీను, మల్లయ్య, మంజుల, సైదులు, వెంకన్న, అంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఓటర్ల తుది జాబితా విడుదల


అర్వపల్లి : జాబితా విడుదలచేస్తున్న కార్యదర్శి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలానికి సంబంధించిన తుది ఓటరు జాబితాను మంగళవారం అన్ని గ్రామ పంచాయతీలలో విడుదల చేశారు. ఈ వివరాలను ఎంపీడీఓ టి.గోపి వెల్లడించారు. మండలంలోని 152 వార్డులకు గాను మొత్తం 24,615 మంది ఓటర్లు ఉన్నారని, వీరి కోసం 152 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రామకృష్ణ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు నర్సింహరాజు, శిల్పిక, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం తుది ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎం. సునీత మాట్లాడారు. మండలంలో మొత్తం 29,066 మంది ఓటర్లు నమోదు కాగా 14, 503 మంది పురుషులు, 14, 563 మంది స్త్రీలు ఉన్నట్లు తెలిపారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 166 పోలింగ్ బూత్‌ల ఆధారంగా ఓటరు జాబితా ప్రదర్శించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శశికళ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నెమ్మాది వెంకయ్యకు నివాళి

సూర్యాపేట అర్బన్ : పేద కుటుంబానికి చెందిన నెమ్మాది వెంకయ్య తన కుమారుడు నెమ్మాది లాజర్‌ను సీపీఎం ద్వారా ప్రజా ఉద్యమాలలో పనిచేయడానికి ప్రోత్సహించిన గొప్ప వ్యక్తి అని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. కేసారం గ్రామానికి చెందిన నెమ్మాది వెంకయ్య మరణించడంతో మంగళవారం ఆయన మృతదేహానికి నివాళులర్పించి మాట్లాడారు. వెంకయ్య మరణం కేవలం కుటుంబానికే కాకుండా గ్రామానికి కూడా తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం. శేఖర్, కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

నూతనకల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని లయన్స్ క్లబ్ మోటివేషనల్ స్పీకర్ పూర్ణశశికాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విజయమేరి పాఠశాలలో యువ వికాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి చెడు అలవాట్లకు వ్యతిరేకంగా ఉత్తమ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బందు కృష్ణయ్య, కోశాధికారి భయ్యా రవీందర్, ఏలేటి నారాయణరెడ్డి, షేక్ నాగుల్‌మీరా, సాబాది వెంకట్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదంపై హర్షం

తిరుమలగిరి : బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించడంపై బీసీ సంక్షేమ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పూలే, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు మాట్లాడారు. బిల్లు ఆమోదానికి సహకరించిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంగరి బ్రహ్మం, చంద్రమౌళి, కడెం లింగయ్య, ఎల్లంల యాదగిరి పాల్గొన్నారు.

గణనాథుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి


తిరుమలగిరిలో వినాయకుడికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు


సూర్యాపేట : గణేశుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న సర్వోత్తమ్ రెడ్డి, తదితరులు

సూర్యాపేట అర్బన్: గణనాథుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని 30వ వార్డు మాజీ కౌన్సిలర్, బీజేపీ ఫ్లోర్ లీడర్ పల్స మహాలక్ష్మి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పల్స మల్సూర్‌గౌడ్ అన్నారు. నెహ్రూనగర్‌లోని వినాయకుడి విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బత్తుల వెంకటయ్య, బీఆర్‌ఎస్ నాయకుడు బత్తుల రమేష్, ఉత్సవ కమిటీ సభ్యులు పెండ్ర రమేష్, వాడపల్లి ప్రభాకర్, గోపిచంద్, రవి, యాకోబు పాల్గొన్నారు.

తుంగతుర్తి : ప్రజలందరిపై గణనాథుడి ఆశీస్సులు ఉండాలని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు సంకినేని వరుణ్ రావు ఆకాంక్షించారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని శారదనగర్‌లో ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహం వద్ద మంగళవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎల్లబోయిన భిక్షం, శ్రీను, సైదులు, దశరథ, వెంకటేష్, వెంకన్న, నాగరాజు, రాజు, ఈగ నాగన్న, గోపారపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి 108 రకాల నైవేద్యాలు

తిరుమలగిరి : తిరుమలగిరిలోని తెలంగాణ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడికి 108 రకాల నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండపం నిర్వాహకులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

నాగారం : అన్నిదానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి అన్నారు. ఫణిగిరిలో స్నేహకళ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద మంగళవారం ఎర్ర సావిత్రి–యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాతి వీరమల్లుగౌడ్, పానుగంటి నర్సింహారెడ్డి, రాంరెడ్డి, లక్ష్మీకాంత్, ఆలకుంట్ల బాలకృష్ణ, స్నేహకళ యూత్ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

నూతనకల్ : నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరిగేలా చూడాలని తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులకు నిమజ్జనోత్సవంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించే ఉత్సవ కమిటీ సభ్యులతో అధికారులు మాట్లాడి ఏర్పాట్లను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సునీత, ఎంపీఓ శశికళ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


సూర్యాపేట : 30వ వార్డులో అన్నదానం..


అర్వపల్లిలో అన్నదానం..


నాగారం : ఫణిగిరిలో..